క్లుప్తంగా

టిఫిన్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శకటం

సీతమ్మధార: ఆర్టీసీ కాంప్లెక్స్ దరి వైఎస్సార్ సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వీఎంఆర్‌డీఏకి చెందిన శ్రీ సాయిరాం టిఫిన్ సెంటర్ నుండి బుధవారం ఉదయం 9.30 గంటలకు ఒక్కసారిగా పొగలు వెలువడ్డాయి. వెంటనే చుట్టుపక్కల దుకాణాల వారు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఫ్రిడ్జ్ ద్వారా వచ్చిన షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్విగ్గీ, జొమాటో రైడర్లకు రక్షణ కల్పించాలి

- సీఐటీయూ డిమాండ్

అల్లిపురం: స్విగ్గీ, జొమాటో రైడర్లకు రక్షణ కల్పించాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జగదాంబ దగ్గరున్న సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల క్రితం ఆక్సిజన్ టవర్స్‌లో అనిల్ అనే డెలివరీ బాయ్ డెలివరీ ఇచ్చేందుకు వెళ్లగా అతని బట్టలు విప్పి కొట్టారని తెలిపారు. అక్కడి పనివాళ్లు ఆపుతున్నా యజమాని కర్రతో ఇష్టానుసారంగా కొట్టారన్నారు. ఈ మేరకు స్విగ్గీ బాయ్స్, కుటుంబ సభ్యుల ఆందోళనతో పోలీస్ కమిషనర్ యజమానిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపించారన్నారు. ఇంత జరిగినా ఇప్పటికీ స్విగ్గీ మేనేజర్ గాని, ప్రతినిధులు గాని బాధితుడిని పరామర్శించలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైడర్లకు రక్షణ, ఉద్యోగ భద్రత, కనీస ఆదాయం వచ్చే విధంగా చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, బంగార్రాజు, రాజేష్, రమేష్, సాగర్, ఉదయ్, విశాఖ క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరీ



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం పాదుకొల్పే రచనలు కథలుగా రావాలన్నారు. పేదల జీవితాలు, సమస్యలను ప్రతిబింబించే రచనలు చేయాలని కోరారు. సమాజ అవగాహనతోనే ఇది సాధ్యమని తెలిపారు. రచయితలకు సూక్ష్మ దృష్టి ఉంటే సమాజంలోని సమస్యలు కనిపిస్తాయని, వాటినే కథా వస్తువులుగా మలుచుకుని రచనలుగా మలచాలని తెలిపారు. రచయిత కె.జి.వేణు కథానిక సాహిత్య విశ్లేషణపై ప్రసంగించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కథా సాహిత్యంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రచయితలు చిన సూర్యనారాయణ, వినయభూషణరావు, కొత్తూరు రమణ, జ్యోతిర్మయి, నిర్మలాదేవి, శ్రీనివాసరావు, పరమేశ్వరరావు, కుమార్ తదితరులు తాము రచించిన కథలను చదివి వినిపించారు.

30న రంజాన్‌పై సదస్సు

సీతమ్మధార: ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌ను పురస్కరించుకుని ఈ నెల 30న ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఐఏఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్ వేదికగా ఆదివారం ఉదయం 10 గంటలకు రంజాన్ ప్రత్యేకతలపై సదస్సు జరుగుతుందని తెలిపారు. ఇదే రోజున తెలుగు వారికి ఉగాది, క్రైస్తవులకు ఎల్ఈఎన్‌టీ సీజన్ పునరుద్ధానం, ముస్లింలకు రంజాన్ పర్వదినాలు జరగనుండటంతో సర్వమత సమభావన ప్రాముఖ్యాన్ని తెలిపేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఆచార్య ఇక్బాల్, అబ్దుల్ రజాక్, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, బ్రహ్మకుమారీస్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. సదస్సులో అన్ని మతాల వారు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల సుడిలో.. చాకలిపేట



అభివృద్ధికి దూరంగా చాకలిపేట



పనిలో మునిగిన రజకులు



కాలికి గాయమై నడవలేని స్థితిలో కూడా దుస్తులు ఆరబెడుతున్న వృద్ధురాలు

- సరిపడినంత నీరు లేక అవస్థలు
- విద్యుత్ లేదు.. మోటార్ పని చేయదు
- ఉతికిన దుస్తులు ఆరబెట్టుకునేందుకు స్థలం కరువు
- పట్టించుకోని అధికారులు.. ప్రజా ప్రతినిధులు

దాబాగార్డెన్స్: నగర నడిబొడ్డు జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరం.. యల్లమ్మగుడి సమీపాన గల చాకలిపేట సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 10 నెలలుకావస్తోంది. చాకలిపేట రజకుల సమస్యలు పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోరు. అధికారులు రజకుల సమస్యలను కన్నెత్తి చూడరంటూ ఈ ప్రాంతవాసులు లబోదిబోమంటున్నారు. మాకు పెద్దగా ఆస్తుల్లేవ్.. ఉన్నదంతా గంగులగెడ్డే.. ఆ గెడ్డనే అనుకుని రజక వృత్తితోనే కాలం గడుపుతున్నాం. ఇది కూడా అరకొరగానే సాగుతోంది. ఈ విషయమై పలు మార్లు రాజకీయ నాయకులు.. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కనీస స్పందన లేదు.

సమస్యలు ఏమిటంటే..

ఈ ప్రాంతంలో 32 ఇళ్లున్నాయి. అందరూ రజకులే. రజక వృత్తినే నమ్ముకున్నారు. 20 గజాలు కూడా లేని స్కీం ఇళ్లకు ఇంటి పన్ను రూ.3 వేలు వస్తోంది. విద్యుత్.. వాటర్ బిల్లు కూడా ఎక్కువే. చాకిరేవు అనగానే అందరికీ తెలిసేది దుస్తులు ఉతకడం. అది నీటితో కూడుకున్నది. కానీ ఇక్కడ నీరుండదు. మోటరు పని చేయదు. విద్యుత్ లైట్లు లేవు. దుస్తులుఆరబెట్టేందుకు ప్రత్యేక స్థలాల్లేవు. గెడ్డలోనే తాళ్లు కట్టి ఆరబెట్టుకోవాలి. ఇదిలా ఉండగా.. ఈ విషయాలన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అతీగతీ లేదు కదా.. రజకులని హేళన చేస్తున్నారని పలువురు 'సాక్షి'దృష్టికి తీసుకొచ్చారు. బోరు అసలే పని చేయడం లేదు. మరి దుస్తులు ఎలా ఉతకాలి? అంటూ లబోదిబోమంటున్నారు.

దాదాపు పది నెలలు కావస్తోంది..

ఎన్నికల ముందు ఓట్ల కోసం అన్ని రాజకీయ పార్టీలు వచ్చాయి. మీ సమస్యల పరిష్కారానికి మేము ముందుంటామంటే.. మేము ముందుంటామని కెవ్వుకేక పెట్టారు. ఎన్నికలయ్యాయి. కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. అధికారంలోకి వచ్చారు. అంతే దాదాపు 10 నెలలయ్యింది. ఇంత వరకు ఒక్కరంటే ఒక్క నాయకుడు రాలేదు. మేము ఎలా ఉన్నామని.. మా జీవనం ఎలా ఉందో? తెలుసుకునే నాథుడే కరువయ్యాడు. ఎన్నికల ముందు ఎన్నో ప్రగల్భాలు పలికిన వారంతా కానరావడం లేదు.

గత ప్రభుత్వంలో న్యాయం జరిగింది..

మేము సామాజికంగా.. ఆర్థికంగా బలహీనులం. దశాబ్దాలుగా చాకిరేవునే నమ్ముకున్నాం. వచ్చేదాంతోనే జీవనం సాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఎంతో కొంత న్యాయం జరిగేది. కూటమి ప్రభుత్వంలో మా సమస్యలు తీరుతాయని అనుకుంటే.. అసలుకే ఎసరె పెడుతున్నారు. మా సమస్యలు తీర్చాల్సింది పోయి మాపై అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు.

– అప్పల నరసమ్మ, రజక వృత్తిదారు

మా సమస్యలు ఎవరికి చెప్పకోవాలి..

గత ప్రభుత్వంలో అయితే ఏదో ఒక సంక్షేమం పథకం ద్వారా ఎంతో కొంత మా అకౌంట్లలో జమయ్యేది. వృత్తి పరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాకు.. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా కనీసం పూట గడిచేది. ఇప్పుడు అదీ లేదు. సంక్షేమం అనేది కూడా లేదు. ఎలాంటి చేయూత లేకుండా బతుకు ఈడుస్తున్నాం. సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ఎవరికి చెప్పుకోవాలి మా ఆవేదన. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– అప్పారావు, రజకుడు

నీళ్లు లేక ఇబ్బందులు..



మున్సిపల్ కుళాయి ద్వారా వచ్చే నీటి కోసం పలువురి ఇళ్లకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. మా వృత్తికి రెండు.. మూడు బిందెలు సరిపోవు కదా? గెడ్డలోనే తాళ్లు కట్టి బట్టలు ఆరేసుకుంటున్నాం. గెడ్డ మురుగులోనే మునగాల్సి వస్తోంది. బట్టలు ఆరబెట్టుకునేందుకు ప్రత్యేక స్థలాలు లేవు.

– శ్రీను, రజకుడు

సమస్యలు పరిష్కరించండి..



రాజకీయ నాయకులు.. అధికారులు మా సమస్యలు పరిష్కరించండి. పేదరికంలో ఉన్న వారం. ఈ వృత్తినే నమ్ముకున్నాం. గెడ్డ పక్కనే ఉంటున్నాం. దోమలు విపరీతంగా ఉన్నాయి. అనేక రోగాలకు గురవుతున్నాం.

– అప్పల నరసమ్మ, రజక వృత్తిదారు

ముస్లింలకు వాసుపల్లి రంజాన్ తోఫా

- రూ.20 వేలు అందజేత



ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముస్లింలకు రూ.20 వేలు రంజాన్ తోఫా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లింలంటే చిన్న చూపు చూసే చంద్రబాబు, పవన్ కల్యాణ్ బీజేపీతో జతకట్టి సనాతన ధర్మమంటూ వారికి ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. దక్షిణ నియోజకవర్గం ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతమని, అతి ప్రాచీన దర్గా కూడా ఇక్కడే ఉందన్నారు. నియోజకవర్గంతో పాటు ముస్లింలతో తనది విడదీయరాని బంధమని వాసుపల్లి తెలిపారు. వాసుపల్లి అందిస్తున్న సహాయ సహకారాల పట్ల ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు హజ్ యాత్రకు వెళ్లేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. షాదీ ఖానా అభివృద్ధికి వాసుపల్లి ఎంతో కృషి చేశారని వారు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ షకీల్, పలు వార్డుల నాయకులు దశమంతుల చిన్ని, ముత్తాబత్తుల రమేష్, లండా రమణ, దూడ అప్పారావు, మహ్మద్ నజీమ్, ఖాసీం, అనీష్, అష్రాఫ్, అజీజుల్లా, జమెల్, జాకీం, జాఫర్ అలీ, భాను తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తనా సారథి అన్నమయ్య



మాట్లాడుతున్న చాగంటి సోమ సుందర్

దాబాగార్డెన్స్: ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో బుధవారం అన్నమాచార్యుని వర్ధంతి, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకొండి వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చాగంటి సోమసుందర్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. వేంకటేశ్వరస్వామి సంకీర్తనలతో అర్చించి అన్నమయ్య సంకీర్తనా సారథిగా నిలిచారన్నారు. టీటీడీ ద్వారా అన్నమాచార్య సంకీర్తనల వైభవానికి సేవలందించిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంగీత సేవలు సదా స్మరణీయమన్నారు. ఈ సందర్భంగా సంస్థ శిష్య బృందం అన్నమాచార్య సంకీర్తనలు శ్రావ్యంగా ఆలపించి మన్ననలు పొందారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పి. జగన్మోహన్‌రావు, కోశాధికారి జి. మధుబాబు, సంయుక్త కార్యదర్శి వి. మధుసూదనరావు, సహాయ కోశాధికారి ఎం. నాగేశ్వరరావు, సంస్థ శిష్య బృందం, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు అభివృద్ధికి సొంత నిధులు

- పోటీలో ఉన్న న్యాయవాదుల వెల్లడి

విశాఖ లీగల్: సొంత నిధులు ఖర్చు చేసైనా న్యాయవాదులకు ఉన్నత సేవలందిస్తామని పలువురు న్యాయవాదులు ప్రకటించారు. ఈనెల 28వ తేదీన జరిగే న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సంబంధించి అఖిలభారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక చర్చా కార్యక్రమం చేపట్టారు. ఐలు అధ్యక్షుడు నూకల వెంకటేశ్వరరావు అనుసంధానకర్తగా వ్యవహరించారు. ఎన్నికల సంఘం అధ్యక్షుడు జీఎం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ పదవులకు పోటీ చేస్తున్న న్యాయవాదులు తమ అజెండాను ప్రకటించారు. ఇందులో అధిక శాతం న్యాయవాదులు తమ సొంత నిధులు లేదా కార్పొరేట్ నిధులతో జిల్లా కోర్టు అభివృద్ధికి అంకితం అవుతామని తెలిపారు. ముఖ్యంగా అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న ఎంకే శ్రీనివాస్, ఐఎం అహ్మదీ, నమ్మి సన్యాసిరావు యాదవ్ తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో పోటీదారులతో పాటు అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు

ఉగాది వేడుకల కరపత్రిక ఆవిష్కరణ

తాటిచెట్లపాలెం: రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 30వ తేదీ నుండి జరగనున్న ఉగాది వేడుకల కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉగాది–శ్రీరామ నవమి వేడుకలు ఈ నెల 30వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నాకు ఆత్మహత్యే శరణ్యం

- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, బాబూరావులపై లైంగిక వేధింపుల కేసు పెట్టాలని హోం మంత్రి ఒత్తిడి
- ఒప్పుకోలేదని లేనిపోని ఆరోపణలు చేసి ఆరు నెలల క్రితం విధుల నుంచి తొలగించిన డీపీవో శిరీషరాణి
- నాకు జరిగిన అన్యాయంపై పిఠాపురం కార్యాలయంలో పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- అనకాపల్లి కలెక్టర్, డీపీవోలపై పంచాయతీ కార్యదర్శి సమిహ తీవ్ర విమర్శలు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు సమిహ

అల్లిపురం: తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించి, తనను, తన కుటుంబాన్ని రోడ్డున పడేశారని, తనకు ఆత్మహత్యే శరణ్యమని, ఇందుకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శిరీషరాణి, కలెక్టర్ విజయ కృష్ణన్‌లే బాధ్యులని ఈదడం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సమిహ తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు దాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. 2014లో దివంగత సీఎం వైఎస్సార్ దయ వల్ల ముస్లిం రిజర్వేషన్‌లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సంపాదించానన్నారు. సర్వీసు మొత్తం దాదాపు మూరుమూల పంచాయతీల్లోనే సాగినట్లు తెలిపారు. పలుమార్లు తన తల్లికి బాగాలేదని బదిలీ చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అర్జీలు పెట్టుకోగా చివరికి పాయకరావుపేటలోని ఈదడం పంచాయతీలో పోస్టింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. తన విధుల్ని సక్రమంగా నిర్వహించుకుంటున్నా.. అకారణంగా జీతం నిలిపేశారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. మునగపాకలోని తోటాడ పంచాయతీకి డిప్యుటేషన్ కోరగా, పలాపు ఆనందపురం పంచాయతీలో పోస్టింగ్ ఇచ్చారని పేర్కొన్నారు.

వరుసగా వేధింపులు

2023 జులైలో లేనిపోని ఆరోపణలతో ఫోర్జరీ కేసు పెట్టి తనను సస్పెండ్ చేశారని సమిహ వివరించారు. 2024 ఆగస్టు 22 వరకు ఎంక్వయిరీ చేయకుండా డీపీవో శిరీషరాణి 'రిటైర్‌మెంట్ యాస్ మేజర్ పనిష్‌మెంట్'అని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. దీనిపై హోం మినిస్టర్ అనితకు ఫిర్యాదు చేయడానికి వెళితే, గత ప్రభుత్వ ఎమ్మెల్యేలు కన్నబాబు రాజు, గొల్ల బాబూరావులపై లైంగిక వేధింపుల కేసు పెట్టాలని తనపై ఒత్తిడి తీసుకువచ్చారని వెల్లడించారు. అసలు వారిని ఏనాడూ ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిసిందే లేదని పేర్కొన్నారు. తనకు జరిగిన అన్యాయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వెళితే.. తనపై జూనియర్ అసిస్టెంట్‌తో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించారని తెలిపారు. ఒక మహిళగా తాను ఫిర్యాదు చేస్తే స్పందించని పోలీసులు, అతని ఫిర్యాదుపై మాత్రం కేసు నమోదు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం కార్యాలయం, మంగళగిరి కార్యాలయానికి పలుమార్లు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆక్షేపించారు. న్యాయం జరగకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమని వాపోయారు. ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం స్పందించి తన ఉద్యోగం తనకు ఇప్పించాలని, నిలిపివేసిన జీతం, పెండింగ్ బిల్లుల్ని చెల్లించాలని కోరారు.

సీతా పరిణయ వేళాయే..



రెండో భద్రాద్రిగా గణతికెక్కిన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం

- సీతారామచంద్రాలయంలో నవమి వేడుకలు
- 30న ఉగాది సంబరాలు..
- 6న స్వామి వారి కల్యాణం.. 7న శ్రీరామ పట్టాభిషేకం

దాబాగార్డెన్స్: లోకాభిరాముడు శ్రీరాముడు జానకిని పరిణయమాడే సుముహూర్తం సమీపించడంతో జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో కల్యాణ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మిరుమిట్లు గొలిపే దీపాలంకరణ చేపట్టారు.

కార్యక్రమాలు ఇవీ..

ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 30వ తేదీ ఉదయం కల్యాణరాట, పెండ్లి కుమారుని చేయుట, పంచాంగ శ్రవణం జరపనున్నారు. 31 నుంచి వచ్చే నెల 5 వరకు ప్రతి రోజూ ఉదయం స్వామికి విశేష ఆరాధన, సహస్ర నామార్చన, సాయంత్రం వేళల్లో విశేష అరాధన, విశేష హారతులు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 6 ఉదయం 5 గంటలకు స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు జరపనున్నారు. ఉదయం 10 నుంచి 12 వరకు స్వామి కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 7న శ్రీరామ పట్టాభిషేకం జరపనున్నారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు 0891- 2528645, 2566514 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని ఆలయ వర్గాలు తెలియజేశాయి.



సీతారామచంద్రస్వామి

భక్తులకు స్వామి వారి శేషవస్త్రం..

రెండో భద్రాద్రి వలే అభివృద్ధి చెందుతున్న అంబికాబాగ్ రామాలయంలో శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవంలో పాల్గొనదలిచే ఉభయదాతలు రూ.1,116 చెల్లించి, రసీదు పొంది కార్యక్రమంలో పాల్గొనవచ్చు. కల్యాణం అనంతరం ఉభయదాతలకు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేయనున్నారు.

వైభవంగా వేడుకలు..

అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి సీతారామ కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి 'సాక్షి'కి తెలిపారు. స్వామి వారి ఉత్సవాల సందర్భంగా 5 వేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఈవో తెలియజేశారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు ఉదయం, సాయంత్రం స్వయంగా జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి. రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అమ్మవారి జలాభిషేక కార్యక్రమానికి పలు చోట్ల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికకు..



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: ఊర్వశి కూడలి పరిధి బర్మాక్యాంప్‌లో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకుడు శర్మ నేతృత్వంలో మహా జలాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి దంపతులు 108 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం పంచామృతాభిషేకాలు, విశేష పుష్పాలంకరణ, దూప దీప నైవేద్యాలతో పూజలు జరిపారు. పూజలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.14.12 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీ లెక్కించారు. 37 రోజులకు గాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.14,12,593 నగదు, 173 గ్రాముల 100 మిల్లీగ్రాముల బంగారం, 11 కేజీల 100 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దుర్గాలమ్మ ఆలయ ఈవో పి.శేఖర్‌బాబు, సహాయ కమిషనర్ కార్యాలయం సీనియర్ సహాయకులు డి.జె. ప్రభ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికురాలి మృతి

ఆరిలోవ: హనుమంతవాక వద్ద గోడ నిర్మాణ పనులు చేస్తుండగా ఓ కార్మికురాలు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. హనుమంతవాక కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ అధికారులు కొద్ది రోజులుగా రక్షణ గోడ నిర్మాణ పనులు కాంట్రాక్టర్ ద్వారా జరుపుతున్నారు. ఈ పనుల్లో భాగంగా మంగళవారం గణపతి రంభ(59) అనే మహిళ వాటరింగ్ చేస్తుండగా.. డ్రిల్లింగ్ మిషన్ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో ఆమెను తోటి పనివాళ్లు విమ్స్‌కు తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. అక్కయ్యపాలెంలో కార్మికురాలు రంభ నివసిస్తూ రోజు ఇక్కడ గోడ పనులకు వస్తుండేవారు. ఆమె మృతి చెందడంతో బంధువులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గోపాలపట్నం: అంగన్‌వాడీ కార్యకర్తలకు హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. సీడీపీవో శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. పిల్లల స్థాయి ఆధారంగా బోధన ఉండాలన్నారు.